# అమ్మా! మోసపోయావు కదూ?

రావూరు తుకారాం



ఉదయం!

ఆరుగంటల సమయం. తూర్పు దిక్కున అగ్ని గోళంలా బాలభానుడు ప్రత్యక్షమయ్యాడు. పక్షుల కిలకిల రావములతోనూ, అప్పుడప్పుడు రోడ్డుపై అటు ఇటు వెళుతున్న వాహనాల రొదతోనూ రణరంగానికి ముందుగా డప్పు మోతలా ఆ రోజు ప్రారంభమయింది. తూర్పు వాకిలితో నాలుగు గదులు కలిగి, ముందు వసారా ఉన్న ఆ డాబా ఇంటికి చుట్టూ ఐదడుగుల కాంపౌండు వాలు. కాంపౌండు వాలుకు పెద్ద చెక్క తలుపుల గేటు. ఆ ఇంటిలో నుంచి మీడియం ట్యూనుతో, తియ్యటి గాత్రంతో నాస్తికుల సైతం భక్తి పారవశ్యంతో మునిగేంత ఇదిగా....వెంకటేశ్వరస్వామి సుప్రభాతం వినిపిస్తుంది. అలాంటి సమయంలో...ఆరడుగుల ఎత్తు... ఛామనఛాయ రంగులో, ఉంగరాల జుత్తు, కోరమీసంతో స్ఫురద్రూపి అయిన ఆ పాతికేళ్ళ యువకుడు గళ్ళలుంగీ కట్టి, దానిపై కట్ బనీను వేసి చేతిలో ఆ రోజు దినపత్రికతో గదిలో నుంచి ముందు వసారాలోకి వచ్చి అచట ఉన్న కుర్చీలో కూర్చొని పేపరు చదివేందుకు ఉద్యుక్తుడయ్యాడు. అలాంటి సమయంలో పక్క గదిలోంచి ఫుల్‌స్టాప్ లేని భయంకరమైన దగ్గు వినిపిస్తోంది. ఆ దగ్గు వింటే పగవాళ్లు కాదు కదా...రాక్షసులు సైతం జాలితో ద్రవించేంత భయంగా వుంది.

చేతిలో చీపురు కట్టతో విసురుగా వచ్చిన ఆ యువతి చేతిలో ఉన్న చీపురును నేలపై విసిరికొట్టి, ఊడి వీపు మీద పడుతున్న తలవెంట్రుకలను కొప్పుగా ముడివేసి, భర్త చేతిలోని పత్రికను విసురుగా తన చేతిలోకి లాక్కొని, పక్కనే వున్న టీపాయి మీదకు గిరాటు వేసింది. అందుకు అసహనంతో భృకుటి ముడివేసిన అతనివైపు కొఱకొఱ చూస్తూ...

"ఏమండీ! ఇది సంసారి కొంపా? లేక గవర్నమెంటు హాస్పిటలా? శనివారం కదా! శ్రీనివాసుని సుప్రభాతం శ్రద్ధగా విందామనుకున్నాను. ఈ ముసలిదాని దగ్గుతో సుప్రభాతం కాదు కదా!...లవకుశలోని పాటలు సైతం తడిసిన పటాసుల్లా తుస్సుమనేలా వున్నాయి. రాని దగ్గును బలవంతంగా రప్పించుకుంటూ...చుట్టు ప్రక్కల వాళ్ళ దృష్టిలో మనల్ని రాక్షసుల్లా గబ్బు పట్టిస్తుంది. ఈ ముసలి దాని దగ్గు వింటూ...ఒక్క క్షణం కూడా నేను ఈ కొంపలో వుండను. ఎవర్ని ఉద్ధరించేందుకండీ ఈ ముసల్ది బతకడం?"

మాటలతో దడదడలాడించిన భార్యతో ఏదో చెప్పేందుకు అతను నోరు తెరిచేంతలో ఆ దంపతుల ఐదు సంవత్సరాల తనయుడు ఒక చేత్తో నోట్‌బుక్, వేరొక చేతితో పెన్నుతో...తండ్రి దగ్గరకు వచ్చి ఏదో క్లాసు లెక్కను గురించి అడిగాడు. ఆమె తన తనయుని తలను కుడిచేత్తో నిమురుతూ....

"నా బంగారు తండ్రికి ఆ ముసలి దాని క్షయరోగం అంటుకుందేమోనని భయంగా వుంది'' అని తనలో తను చెప్పుకుంటూ కుమారుని తనవైపు తిప్పుకుని "చిట్టీ! మీ నానమ్మ

దగ్గరకు వెళ్ళకు. ఆమె చేత్తో ఏది పెట్టినా తినకు. ఆ పాడు జబ్బు నీకూ...వస్తుందేమోనని భయంగా వుంది" అంటూ మహా గారాభంగా చెప్పింది. తల్లి మాటలకు ఆ పసివాడు మదిలోనే ఈసడించుకుంటూ, తండ్రిని చూస్తూ అర్థింపు స్వరంతో..."నానమ్మను డాక్టరు దగ్గరకు తీసికెళదాం నాన్నా!" అని అడిగాడు.

అతను టీపాయ్ మీదున్న పేపరు చేతిలోకి తీసుకుంటూ..."డబ్బు లేదురా!" అన్నాడు.

తండ్రిమాటకు ఉడుక్కున ఆ బాలుడు "జీతం డబ్బులు అమ్మ చేతికి ఇచ్చి చీరలు తెచ్చుకోమన్నావుగా?" అని మోమాటం లేకుండా అడిగాడు. పసివాని ప్రశ్నలతో...ఆ దంపతులు కొన్ని క్షణాలు స్టన్ అయ్యారు. ముందుగా తేరుకున్న ఆమె కుమారుని కళ్లల్లోకి తీక్షణంగా చూస్తూ...

"వేలెడంత లేవు. తండ్రినే ప్రశ్నిస్తావా? నోరు మూసుకొని లోపలకు వెళ్లు" అని గద్దించింది. అందుకు ఆ పసివాడు చిన్న పరుగుతో...ఏడుస్తూ లోపలకు వెళ్లాడు. ఇంతలో మృత్యు వాహన పద ఘట్టనలాంటి భయంకర దగ్గుతో ఆ ఇల్లు దద్దరిల్లింది. ఆ ఇంటి గోడలకు స్పందించే హృదయముండి, కన్నీరు కార్చే కనులే వుంటే అరవీర భయంకరమైన ఆ దగ్గును వినలేక మైనపు ఒత్తిలా కరిగి కరిగి అలాగే...భూదేవిని కావళించుకొని మిన్నకుండేవి. ముందుగా దీర్ఘాలోచన నుంచి తేరుకున్న ఆ అభినవ తాటకి భర్త కళ్ళల్లోకి సీరియస్‌గా చూస్తూ...

"ఆఖరి సారిగా చెబుతున్నాను. రెండు రోజులు గడువిస్తాను. మీ అమ్మను ధర్మాసుపత్రికి తరలిస్తావో? అనాథాశ్రమంలో చేరుస్తావో, కాదు కూడదంటే విషం ఇచ్చి చంపుకుంటావో నాకు తెలియదు. మూడవ రోజు నుంచి మీ అమ్మ దగ్గు నేను వినకూడదు. ప్రతి ఉదయం ప్రశాంత చిత్తంతో నేను సుప్రభాతం వినాలని మీరు భావిస్తే...ముసల్ది ఈ ఇంట్లో ఉండకూడదు. ఇహ మీ ఇష్టం" అని భర్తకు సీరియస్‌గా వార్నింగు ఇచ్చి విసురుగా లోపల గదిలోకి వెళ్లింది. ఆలి చేతిలో అప్పడం లాంటి ఆ మగాడు ఏదో దీర్ఘాలోచనలో మునిగాడు. ఇంతలో తల్లి గదిలో నుంచి పెద్ద శబ్దం రాగా... లేచి నిలుచుని విసురుగా అటు వెళ్లాడు.


తల్లి గది దగ్గరకు వచ్చిన అతను మూసి వున్న గది తలుపులను చేత్తో నెట్టి గదిలోకి వెళ్ళాడు. కటిక చీకటితో తపస్సు చేస్తున్న ఆ గది తనలోని ఏ వస్తువునూ ఎవ్వరికీ అగుపించనీయదు. అతను గోడకు వున్న స్విచ్‌ను చేత్తో నొక్కగా...వెలుతురు ఆ గదిలోని చీకటిని తరిమి కొట్టింది. ఇంటిలో వాయువ్య మూల ఉన్న ఆ చిన్న గదికి చిన్న కిటికీ. అదీ మూసి వుంది. మంచంలో నుంచి క్రింద పడిన ఆమె తిరిగి మంచంలో కూర్చునేందుకు ప్రయత్నిస్తుంది. వీలు పడదు. కన్న కొడుకు చేయూతనిస్తాడేమోనని ఆశపడింది. అయితే ఆమె ఆశ అడియాస అయ్యింది. రోషంతో పంటి బిగువున మంచం పట్టె సాయంతో తిరిగి మంచంలో కూర్చుంది. నీరు తాగలేదు. సరి కదా చెంబులోని నీరు చేయి తగిలి నేలపాలయ్యాయి. కనీసం తల్లికి తాగేందుకు నీరు ఇద్దామన్న జ్ఞానము చూస్తున్న ఆ రెండు కాళ్ల జంతువుకు లేదు. గదిలో నుంచి వస్తున్న దుర్గంధాన్ని భరించలేని అతను చేత్తో ముక్కు మూసుకొని గది నలుమూలల పరికించి చూశాడు. గోడలు మొత్తం సాలీడులకు యవ్వనం వచ్చి ఊయలలూగుతున్నాయి. గది ఊడ్చి ఎన్ని రోజులయ్యిందో లెక్క కట్టడం కష్టం. కుక్కి మంచంలోని ఆ ఎముకల పోగును తెలిసిన వాళ్లు తప్ప తెలియని వాళ్లకు ఆ ఆకారం ఆడా? మగా? అని చూడగానే చెప్పలేరు. ఆమె వయస్సు ఎంత ఉంటుందో ఇంపోర్టెడ్ డాక్టరు కూడా విడమరిచి చెప్పలేడు. కన్న కొడుకు చాలా రోజులకు వచ్చాడు. మనసారా మాటలు చెప్పుకోవచ్చు అని మురిసిపోయింది ఆ పిచ్చి తల్లి. అయితే...బ్రిటీష్ హయాములో అండమాన్ జైలునే ఓడించగల సత్తా ఉన్న ఆ గదిని మరోమారు పరికించి చూసిన అతను కన్న తల్లిని తన్నేలా యాక్షన్ చేస్తూ...

"నీవు మనిషివా? నీకు బుద్ధి అనేది వుందా? మంచంలో నుంచి కింద పడేంత పసిపాపవా? రాని దగ్గును రప్పించుకుంటూ...చుట్టు ప్రక్కల మమ్మల్ని గబ్బు పట్టించావు. అదీ చాలదన్నట్టుగా మంచంలో నుంచి కింద పడి ఏ కాలో చెయ్యో విరుచుకొని మమ్మ రాక్షసుల్లా చిత్రించాలనుకున్నావా? కిటికీ తలుపులు మూసి లైటు వేసుకోకుండా చీకటిలో నిన్ను ఎవ్వరు నీటి కోసం పాకులాడమన్నారు?" అని గద్దించి అడిగాడు. తనయుని మాటలకు ఆ తల్లి హృదయం అవమానంతో కుంచించుకుపోయింది. వస్తున్న దగ్గును ధారాపాతంగా కారుతున్న కన్నీటిని అతి బలవంతంగా నిగ్రహించుకొని, కుమారుని చూసేందుకు మనసు రాక ఎటో చూస్తూ...

"కిటికీ తలుపు తియ్యకు నీ దగ్గు పదిమందికి వినిపిస్తుంది. లైటు వేయకు కరెంటు బిల్లు తడిసి మోపెడవుతుంది అని చెప్పింది నీ భార్య. అందుకే అవి రెండూ మానేశాను. నేను ఏ జన్మలో ఏ పాపం చేశానో...ఈ జన్మలో మీకు చాలా శ్రమ ఇస్తున్నాను. ఎంతకీ తగ్గని ఈ దగ్గు దగ్గుతూ...జైలు లాంటి ఈ ఇరుకు గదిలో నేను ఉండలేను. ఈ నరకం భరించే కన్నా చావడం ఎంతో నయం. నిన్ను కన్నందుకు, పెంచి ఇంత వాణ్ణి చేసినందుకు ప్రతిఫలంగా నాకు ఇంత విషం ఇవ్వు బాబు. అంతకన్నా నిన్ను ఏమీ అడగను" అని ప్రాధేయపడుతూ తన రెండు అర చేతులతో మోము కప్పుకొని బోరున విలపించింది. తన తప్పును ఒప్పుకునేందుకు, కన్న తల్లిని ఓదార్చేందుకు మనసు రాని ఆ కృతఘ్నుడు అచట నుంచి అదృశ్యమయ్యాడు.

* * *

ఈ భూప్రపంచంలో ఎన్ని రకాల అవమానాలు. బాధలు ఉన్నాయో అన్నింటినీ స్త్రీయే భరించింది. యుగాలు, తరాలు మారవచ్చు. ఈ వ్యవస్థ మారితే మారవచ్చు. అయితే...స్త్రీకి నాలుగు దశల్లో ఉండే కట్టుబాట్లు, కలిగే అవమానాల్లో మార్పు లేదు. మార్పు రావాలంటే...చాలా కాలం పట్టవచ్చు. లేదా



మార్పు రాకుండానే ఈ భూ ప్రపంచం అణుబాంబులతో దగ్ధం కావచ్చు. లేదా జలప్రళయంతో మునిగిపోవచ్చు.

ఆనాడు భారతంలో విరాట పర్వంలో కీచకుని చేత సైరంధ్రిగా ద్రౌపది అనుభవించిన అవమానాలకు ఈనాడు ఇచట తల్లిగా కన్న కొడుకు చేత అనిపించుకున్న మాటలకు పెద్దగా తేడా ఏమీ లేదు. కాకుంటే ఒక్కటే తేడా. అది ఫిజికల్ టార్చర్. ఇది మెంటల్ టార్చర్. అచట కీచకుడు పరాయి వాడు. ఇచట నవమాసాలు మోసి, ఊపిరితో ఊపిరి పోసి, కని కంటికి రెప్పలా కాపాడుకుంటూ...అసహ్యాన్ని అవతల పారేసి ముడ్డి కడిగి, మూతి తుడిచి, మూతి మీద మీసం మొలిపించి మగాడిగా నిలబడితే...చదువుకున్న ఆ రెండు కాళ్ల మృగం సంస్కారాన్ని మరచి, విశ్వాసాన్ని పాతర వేసి కన్న తల్లి ప్రాణాంతక దగ్గును బోగస్‌గా సర్టిఫికేట్ ఇస్తాడా? పొరపాటు లేకుండా క్యాలిక్లేషన్ చేస్తే...వీడికన్నా ఆ కీచకుడే బెటరేమో!

కన్న కొడుకు చాలా రోజులకు గదిలోకి వచ్చాడు. తన బాధను అర్థం చేసుకొని డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి మహమ్మారి లాంటి క్షయ జబ్బునుంచి తన్ను విముక్తి చేస్తాడని ఆశపడ్డ ఆ తల్లి ఆశ నిరాశగానే మిగిలింది. మోసపోయాను. నేను దారుణంగా మోసపోయాను అన్న భావన ఆమె ఎదను నులిమేసింది.

పసి వయసులోనే తండ్రికి దూరమైన తన ఏకైక కుమారునికి అన్నీ తానై వాడికి ఏ లోటూ రాకూడదన్న తపనతో తను అనుభవించిన బాధలు, అవమానాలు, నిదుర లేని రాత్రులు జెట్ స్పీడుతో ఆమె మదిలో మెదలగా, కన్న కలలు, ఊహించుకున్న ఊహలు చెదిరిపోగా...ఆ తల్లి బాధతో విలవిల్లాడింది. ఆమె కన్నీరు సెలయేరులయ్యాయి. అప్పుడే అక్కడకు వచ్చిన ఆమె ఘనవడు తన చిట్టి చేతులతో ఆమె కన్నీరు తుడిచి తాగేందుకు మంచి నీరు ఇచ్చాడు. పిదప దాపరికం లేకుండా...తనకు, తన తల్లితండ్రికి జరిగిన సంవాదం, సిటీకి వివాహానికి వెళుతున్న తండ్రితో కంచి పట్టు చీర తెమ్మని తల్లి చెప్పడం అంతా పూసగుచ్చినట్లు ఆమెకు చెప్పాడు. తను పెద్దవాడై డబ్బు సంపాదించి ఆమెను డాక్టరు దగ్గరకు తీసుకెళ్తానని హామీ ఇచ్చాడు. ఆ పసివాని ప్రేమకు, అనురాగానికి అంత బాధలోనూ ఆమె హృదయం పులకించింది. "చిట్టీ!" అన్న తల్లి కేకతో ఆ పసివాడు అక్కడ నుంచి వెళ్ళాడు. పసివాని ద్వారా తన సుపుత్రుని నైజం తెలుసుకున్న ఆమెకు కోపం రాలేదు. అయితే తన మీద తనకే అసహ్యం వేసింది. మూగగా రోధిస్తూ...తన్ను త్వరగా తన దగ్గరకు తీసికెళ్లమని ఆ భగవంతుణ్ణి ప్రార్థించింది.

✳ ✳ ✳

సిటీలో శ్రీలక్ష్మి అపార్టుమెంటు ఫస్టు ఫ్లోరులో ఏడో నెంబరు ఫ్లాటు ముందు నిలుచున్నాడు పెళ్ళి చూసి వచ్చిన మూర్తి. చిన్న నాటి మిత్రుణ్ణి చూసేందుకు వచ్చిన అతను కాలింగ్ బెల్ నొక్కాడు. బెల్ మోగింది. అయితే ఎవ్వరూ లోన వున్న అలికిడి లేదు. రెండు నిముషాలు గడిచాయి. రెస్పాన్సు లేదు. వెళ్ళేందుకు ఇటు తిరిగాడు. గడియ తీసిన చప్పుడయ్యింది. మరలా అటు తిరిగాడు. రేగిన జుట్టుతో, నలిగిన దుస్తులతో, మంకెన పువ్వులాంటి ఎర్రగా వున్న కళ్లతో 5.3 సెం.మీ ఎత్తు. ఎత్తుకు తగ్గ లావుతో లుంగీ కట్టి దానిపై షర్ట్ వేసి పాతికేళ్ళకు రెండు సంవత్సరాలు అటుగా వున్న వ్యక్తి మూర్తిని చూశాడు. ఇతని రాక అతనికి ఇష్టం లేదన్న భావం అతని మోములో స్పష్టంగా అగుపించింది. అయినా మోమాటం కోసం జీవం లేని నవ్వును మోములోకి తెచ్చుకొని...


"రా...రా మూర్తీ! ఇప్పుడేనా రావడం?" అని లోనికి రమ్మని ఆహ్వానించాడు. లోపల హాలులో అన్ని వస్తువులు అస్తవ్యస్తంగా పడి వున్నాయి. కుర్చీలు తిరగబడి వున్నాయి. సోఫాలు స్థానభ్రంశమయ్యాయి. హాలులో వేరొక పక్క కుడి కాలు లేక ఒంటి కాలితో వెల్లకిలా పడి వుంది ఒక స్త్రీ. ఆమె నుదుటి మీద దెబ్బ తగిలినట్టు గుర్తుగా రక్తం కారి గడ్డ కట్టి వుంది. ఆమె వాడే క్రచర్సు రెండూ...ఆమెకు రెండు వైపులా పడి వున్నాయి. స్పృహ లేని ఆ ఏబది వసంతాల అవిటి మనిషి పక్కన వేరొక స్త్రీ కూర్చుని ఆమె మోములోకి చూస్తూ వెక్కిళ్లు పెట్టి ఏడుస్తోంది. హాలులో దృశ్యాన్ని గమనించిన మూర్తి...ఆ సమయంలో తను అక్కడకు వచ్చినందుకు మదిలోనే తనను తానే దూషించుకున్నాడు. రఘు దోషిలా వేరొక వైపు తల వంచుకొని నిలుచుని వున్నాడు. తల ఎత్తి ఇరువురిని మార్చి మార్చి చూసిన ఆ పాతికేళ్ళ యువతి లేచి నిలుచుని ఊడి అస్తవ్యస్తంగా వున్న తల వెంట్రుకలను ముడి వేసి, చీరను సవరించుకుంటూ భర్తను కాల్చే చూపులతో చూస్తూ...

"రే!...ఆడదాని మెడలో పసుపుతాడు. బట్టె దూడ మెడలో పలుపుతాడు ఒక్కటేరా. భార్యను సవ్యంగా చూసుకునే వాడే నిజమైన భర్తరా! నా మెడలో వున్న ఈ తాడుతో నీకు నా మీద హక్కు, అధికారం వచ్చిందని భావిస్తే...ఈ తాడు నాకు అఖ్ఖరలేదురా..." అని రెండు చేతులతో మెడలో పసుపుతాడును తెంచి విసిరి అవతలకు గిరాటు వేసింది. అందుకు "కవితా" అంటూ రెండు అడుగులు ముందుకు వేశాడు రఘు. అందుకు ఆమె తన కుడి చేయి ఎత్తి..."ఆగు...అడుగు ముందుకు వేస్తే అన్యాయంగా మర్డరయిపోతావు" అని వార్నింగ్ ఇచ్చింది. మూర్తి వెళ్ళేందుకు ఉద్యుక్తుడయ్యాడు...

"ఆగండి" అంది కవిత.

నిలిచాడు మూర్తి. భర్తను ఈసడింపుగా చూసిన ఆమె మూర్తి వైపు తన చూపును మరల్చి...

"పేకాటకు తాగుడుకు ఇల్లును గుల్ల చేసినందుకు తల్లిగా చీవాట్లు వేసిందని...అవిటి మనిషి అని తెలిసి స్పృహ తప్పేలా కొట్టాడంటే...సంస్కారం లేని వీణ్ణి ఏమనాలి? పశువు అనాలి కదూ! నన్ను హింసించి, నా బంగారం అంతా కాజేశాడు. భరించాను, జన్మనిచ్చిన తల్లిని కొడతాడా? తల్లి అంటే...వీడికి ప్రేమ, గౌరవం, అభిమానం లేదని నాకు పెళ్లయిన మరునాడే తెలుసుకున్నాను. కొత్త భార్యకు దొంగ చాటుగా స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లు తెచ్చి ఇస్తూ...జన్మ ఇచ్చిన తల్లికి ఉత్త చేయి చూపినవాడే...వీడు భయంకర రోగ్‌గా నా మదిలో నిలిచాడు. మంచి రొమేన్సులో వున్న



సమయంలో...అవసరం ఉండి తల్లి పిలిస్తే...లంజా...అంటూ ఆ కన్న తల్లిని బూతులు తిడుతూ...యాక్సిడెంటులో కాలు పోయిన నాడు హాస్పిటల్‌కు డబ్బు పెట్టలేక తల్లి చావు కోసం అన్ని దేవుళ్లనూ దీనాతి దీనంగా ప్రార్థించిన నాడే...జీవితంలో కంటే కూతుర్నే కంటాను, అంతేగాని చచ్చినా కొడుకును మాత్రం కనను అని మదిలోనే నిర్ణయించుకున్నాను..."

కవిత తన నైజాన్ని మిత్రుని ముందు బహిర్గతం చేస్తుంటే...అవమానంతో ఇతని ఒళ్లు చిల్లులు పడుతుంది. మూర్తి...తేలు కుట్టిన దొంగలా గుటకలు మింగాడు. ఆవేశంతో ఉధృతంగా వచ్చిన ఆయాసాన్ని దిగమింగిన ఆమె భర్తను పురుగును చూసినట్టు చూస్తూ...

"రే!...స్వర్గంలో వున్న అమృతాన్నంతా కలిపి అమ్మ అను రెండు అక్షరాలతో తూకం వేస్తే...అమృతమే తేలికవుతుందిరా..."

అప్పటికే మూర్తి గిల్టీఫీలింగ్‌తో ముడుచుకు పోయాడు. తల్లి గుర్తుకు వస్తుంది. తనూ తన భార్య, అమ్మను అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. తన మీద తనకే అసహ్యం. కొండ మీద నుంచి లోయలోకి దూకి చావాలన్నంత కోపం వచ్చింది. పాలిపోయిన ముఖంతో నిలుచున్న మూర్తిని చూస్తూ పేరు అడిగింది. తన పేరు చెప్పాడు మూర్తి.

"చూడండి మూర్తిగారూ! ఎవరెస్ట్ శిఖరం ఎత్తు కనుగొన్నారు. బంగాళాఖాతం లోతు తెలుసుకున్నారు. చంద్రమండలం దూరం ఎంతో చెబుతున్నారు. అయితే...కన్న తల్లి అనురాగం ఏత్తు, అభిమానం లోతు, ప్రేమ బరువు ఎంతో మీరు చెప్పగలరా? చెప్పలేరు. మీరే కాదు...ఎవ్వరూ చెప్పలేరు...అదే మాతృప్రేమ. అమ్మ అల్ప సంతోషి. ఆమె పట్టు వస్త్రాలు కోరదు. కనకాభిషేకం చేయమని మారాం చేయదు. ఆమె ఎదుట కూర్చుని మనసారా నోటి నిండా మాట్లాడితే...పున్నమి చంద్రుని చూసిన పాలసముద్రంలా పొంగిపోతుంది. అలాంటి తల్లిని కష్టపెట్టిన వీడు బాగు పడడు. నాశనం! సర్వనాశనం అయితీరుతాడు" అంటూ భర్తను చూస్తూ శపించింది. భయంతో మూర్తి ఒడలు జలదరించింది.

ఆమె రఘు వంక హీనంగా చూస్తూ...కింద పడి వున్న స్త్రీని చూపుడు వేలితో చూపెడుతూ..."కన్న తల్లి ఒక్కటేరా కొనడానికి ప్రపంచంలో దొరకనిది. రే! నీకు అమ్మ నాకు అత్తమ్మ. ఈ క్షణం నుంచి నాకూ అమ్మరా. ఈ అమ్మను నేనే చూసుకుంటానురా. ఇహ ఈ ఇంట నువ్వో, నేనో ఎవరో ఒక్కరిమే ఉంటాము. ఐదు నిముషాలు టైము ఇస్తున్నాను. ఈ ఇంట ఉండేది నువ్వా? నేనా? చెప్పు!" అని ఫైనల్‌గా తన మదిలోని మాట చెప్పింది. మూర్తి అక్కడ నుంచి ఎప్పుడు అదృశ్యమయ్యాడో వారిరువురికీ తెలియదు.

* * *

తల్లి గది దగ్గరకు వచ్చిన మూర్తి మూసి వున్న గది తలుపులను విసురుగా నెట్టి "అమ్మా! అమ్మా!" అని ఆప్యాయంగా పిలుస్తూ లైటు వేశాడు. లైటు వెలుతురులో గదిలోని దృశ్యాన్ని చూసిన అతను కొన్ని క్షణాలు కరెంటు షాక్‌కు బిగుసుకు పోయిన అనామకునిలా అలాగే రెప్ప పాటు లేకుండా రాతి విగ్రహంలా నిలుచుండిపోయాడు. తల కిందకు వేలాడుతూ మంచానికి అడ్డంగా పడి వుంది అమ్మ. తెల్లటి చీర ఎర్రటి రక్తంతో తడిసి పిదప ఎండి అట్టలా నిలచింది. నోటిలో నుంచి కారిన రక్తం ఎడమ చెక్కిలి మీద చారికలా కారి ఎండి మరకలా నిలిచింది. కాళ్ళూ చేతులూ ఒకదానికొకటి సంబంధం లేనట్లుగా మంచంలో తలా ఒక దిక్కుగా పడి వున్నాయి. సిటీలో సిమెంటు రోడ్డు మీద వాహనాలు బారుల్లా పరుగు దీస్తున్నట్లుగా చీమలు బారు ఆమె దేహంపై పరుగులు తీస్తున్నాయి. తను ఎంతటి బాధ భరించిందో...తెరుచుకున్న కళ్ళూ, చిట్లించుకున్న ఆమె ముఖమే చెబుతున్నాయి. ఆ భయంకర దృశ్యాన్ని పరికించి చూస్తే...మామూలు మనుషులు కాదు. కాశ్మీరు మిలిటెంట్లకయినా జాలితో గుండె ద్రవించకమానదు. స్పృహలోకి వచ్చాక మూర్తి..."అమ్మా!" అని గావుకేక వేసి తల్లి శవంపై పడి కుళ్ళి కుళ్ళి రోధించాడు. ఆ శోకంలోనే తల్లి తన కోసం పడిన కష్టాలు గుర్తుకు తెచ్చుకున్నాడు. అమ్మ అన్న రెండక్షరాల మాట విలువ కవిత విడమరిచి చెప్పిన మాటలు హృదయాన్ని శూలపు పోటుల్లా వేధించసాగాయి. చేత్తో నుదురు కొట్టుకున్నాడు. రెండు చేతులతో గుండెలు బాదుకున్నాడు. చిన్న పిల్లాడిలా రోదిస్తున్న అతనికి కవిత పెట్టిన శాపాలు గుర్తుకొచ్చాయి. పెనుగాలికి చిగురుటాకులా విలవిల్లాడాడు.

అతని వేదన, రోదన సెంట్ పర్సెంట్ వేస్ట్ అని కూడా అతనికి తెలుసు. "రే! నీ తల్లి ఈ రోజు నుంచి నాకు తల్లిరా! నాకు అమ్మ అయినా ఈ అత్తమ్మను కంటికి రెప్పలా చూసుకుంటానురా!" అంటూ రఘుతో కవిత చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. కవితతో...తన భార్యను పోల్చుకున్నాడు. 'నో...తప్పంతా నాదే! ఆడది చెప్పినట్టుగా తను ఆడడమే తాను చేసిన పెద్ద తప్పు. కన్న తల్లిని దేవుని మించిన దేవత లాంటి తల్లిని తను ఎన్ని అవమానాలు చేశాడో...' ఒకసారి మొదటి నుంచి కడ వరకూ రిపీట్ చేసుకున్నాడు. తల్లి విషయంలో తను ఆడిన ఆటలు గుర్తుకు రాగా...గూడ్సు రైలు కింద పడి చచ్చినా పరవాలేదు అని భావించాడు.

మూర్తి అలికిడికి గది గుమ్మం దగ్గరకు వచ్చిన శైలజ గదిలోని దృశ్యాన్ని చూసి భయంతో స్తంభించి అలాగే నిలుచుండిపోయింది. అత్త ముగింపు అంత దారుణంగా ఉంటుందని ఆమె కూడా భావించలేదు. చిన్న పిల్లాడిలా రోధిస్తున్న భర్తను చూస్తూ...ఆమె జాలితో కరిగిపోయింది. భయకంపిత స్వరంతో "ఏమండీ!" అంటూ భర్తను పిలిచింది. పిలుపు వినిపించిన దిశగా...అపర నృసింహునిగా మారిన సత్యమూర్తి లేచి నిలుచున్నాడు. ఏనాడూ భర్తను అంత ఉగ్ర రూపంలో చూడని ఆమె, భయంతో పరుగు లంఘించుకుంది. అతను ఆమె వెంట పడ్డాడు. మోసపోయిన ఆ తల్లి శవం అలాగే పడి వుంది.❋

